COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

తేది : 23.07.2015
విజయవాడ

**దాడికి గురైన మహిళా తహసిల్దార్‌కు మందలింపు ఇసుక మాఫియాకు వెన్నుదన్ను,**

**ఇదేనా రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం - పి.మధు సిపియం రాష్ట్ర కార్యదర్శి**

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన ముసునూరు తహసిల్దార్‌పై దాడిచేసిన ఇసుక మాఫియా, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు రక్షణ కల్పించటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వాన క్యాబినెట్ పూనుకోవటాన్ని సిపియం రాష్ట్ర కార్యదర్శి పి. మధు ఒక ప్రకటనలో ఖండించారు. గతంలో అనేక కేసుల్లో నేరస్తుడుగా, రౌడిషీటరుగా ఉన్న యంయల్ఏను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండు చేశారు. మహిళా అధికారి అయినా సాహసంతో ఇసుక మాఫియాను అడ్డుకోవటానికి ప్రయత్నించిన వనజాక్షిని అభినందించాల్సిందిపోయి, సరిహద్దు వివాదాన్ని ముందుకు తెచ్చి నేరస్తుడైన యంయల్ఏను రక్షించటానికి ముఖ్యమంత్రి ప్రయత్నించటం రాష్ట్రం మాఫియా శక్తులకు కేంద్రంగా మారటానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించాడు. ఘటన జరిగిన తరువాత సరిహద్దు దాటావు కాబట్టి నీపైనే కేసు పెట్టాల్సివస్తుందని ముఖ్యమంత్రిగారు ఆనాడే తహసిల్దార్‌ను బెదిరించారని చెప్పారు. ముఖ్యమంత్రి చెపుతున్న సరిహద్దుల సూత్రం దొంగలు దొంగతనాలు చేసి యధేచ్ఛగా పారిపోవటానికి పనికి వస్తుంది. దొంగతనం చేసిన దొంగలు జిల్లాల సరిహద్దులు దాటి పారిపోతుంటే అధికారులు పక్క జిల్లా సరిహద్దులు రాగానే వెనక్కితిరిగి రావాలా అని ఆయన ప్రశ్నించారు.

మరోవైపు మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తహసీల్దారుపై దాడి జరుగుతున్నపుడు ప్రేక్షక పాత్ర వహించిన ముసునూరు యస్ఐ, పోలీసులపై చర్య తీసుకోమని డిజిపిని ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చింది. ఇది దాడికి బాధ్యుడైన యంయల్ఏను కాపాడటానికి, పోలీసులను, అధికారులను నేరస్తులుగా చూయించటానికి ప్రభుత్వం పన్నిన వ్యూహంలో భాగమే. రాష్ట్రముఖ్యమంత్రి, మంత్రులు నేరస్తులను కాపాడుతుంటే దిగువస్థాయిలోని అధికారులు ఏ విధంగా చట్టాన్ని కాపాడగలరు? ప్రభుత్వం తక్షణమే చట్టప్రకారం నేరస్తుడైన యంయల్ఏపై చర్యతీసుకొని, ఇసుక మాఫియాను అడ్డుకోవటానికి పూనుకున్న తహసీల్దారు వనజాక్షిని అభినందించి, ఆమెకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండు చేశారు.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి